క్లుప్తంగా

కార్పెట్ రంగానికి పూర్వవైభవం



కార్పెట్, బ్యాంకు స్టాళ్లను సందర్శిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో) : స్థానిక గోదావరి సమావేశ మందిరంలో బుధవారం బీఐఎస్ నాణ్యతా ప్రమాణాలపై నిర్వహించిన వర్క్ షాప్‌లో భాగంగా ఏలూరు కార్పెట్, వివిధ బ్యాంక్ స్టాల్స్ ఏర్పాటుచేశారు. ఈ స్టాల్స్‌ను కలెక్టర్ కె.వెట్రిసెల్వి సందర్శించారు. ఏలూరు జిల్లాకు ప్రతిష్టాత్మకమైన కార్పెట్ రంగానికి పూర్వవైభవం తెచ్చేందుకు జిల్లా యంత్రాంగం కృషిచేస్తుందని ఆమె తెలిపారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా ఎంఎస్‌ఎంఈ, ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లు, ఏర్పాటుకు బ్యాంకర్లు ఇస్తున్న రుణాలు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎల్‌డీఎం డి.నీలాద్రి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి పి.సుబ్రహమణ్యేశ్వరరావు, ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాసరావు, ఎఫ్ఎస్ఎంఈ కన్వీనర్ ఎం వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

పార్టీ కార్యకర్తలకు పరామర్శ



పార్టీ కార్యకర్తను పరామర్శిస్తున్న జేపీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ విశ్రాంతి తీసుకుంటున్న 40వ డివిజన్‌లోని పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను 40వ డివిజన్ కార్పొరేటర్ తుమరాడ స్రవంతి ఆధ్వర్యంలో ఆ పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ బుధవారం పరామర్శించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కొప్పుల రంగబాబు, సామంతుల లక్ష్మణరావు, పల్లి ప్రసాద్, చింతాడ జయమ్మ, నగర అధ్యక్షుడు గుడిదేసి శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్ బాబు, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, కొల్లిపాక సురేష్, దాలి వెంకటేశ తదితరులు పాల్గొన్నారు.

ధరలపై పర్యవేక్షణ

దెందులూరు: జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాలను అమలు చేయాలని తహసీల్దార్ జి.విజయకుమార్‌రాజు అన్నారు. బుధవారం ఏలూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు పెరగకుండా గ్రామ మండల స్థాయిలో అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ప్రజలు అసౌకర్యానికి గురవకొండ చూడాలన్నారు. అక్రమ నిల్వలపై గ్రామస్థాయి ఉద్యోగులు నిఘా ఉంచాలని ఆదేశించారు.

ఆహ్లాదం.. శిథిలం

- అభివృద్ధికి నోచుకోని పార్కులు
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డా
- నిర్వహణను పట్టించుకోని నగరపాలక సంస్థ
- ఇదీ ఏలూరు నగరంలోని పార్కుల దుస్థితి

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో అందరినీ ఆహ్లాద పర్చిన పార్కులు నేడు అభివృద్ధికి నోచుకోక వెలవెల బోతున్నాయి. వీటి కనీస పర్యవేక్షణను నగర పాలక సంస్థ గాలికి వదిలేసిందనే విమర్శలు ఉన్నాయి. దీంతో పలు పార్కులు ఆక్రమణదారులు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిపోయాయి. సిమెంట్ ఆర్చీలు, లైటింగ్, వివిధ ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్‌లు వంటివి శిథిలమయ్యాయి. నగర పాలక సంస్థ బడ్జెట్లో నగరంలోని పార్కుల అభివృద్ధికి ఒక్క పైసా కూడా కేటాయింపులు చేయకపోవడమే దీనికి ఉదాహరణగా నిలుస్తుంది. ప్రచార కార్యక్రమాలకు లక్షలాది రూపాయాలు వెచ్చించే అధికారులు, ప్రజాప్రతినిధులు చిన్నారులు, పెద్దలకు ఉపయోగపడే పార్కుల అభివృద్ధిని పట్టించుకోకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

కలెక్టర్ సంజయ్‌జాజు హయాంలో అభివృద్ధి

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సంజయ్‌జాజు హయాంలో ఏలూరు నగరంలోని పార్కులకు స్వర్ణయుగంగా చెప్పవచ్చు. నగరంలోని ప్రధానంగా ఉన్న 14 పార్కుల అభివృద్ధికి ఆయన పెద్ద ఎత్తున నిధులను వెచ్చించారు. పార్కుల చుట్టూ సిమెంట్ డిజైన్లు, పార్కు లోపల వాకింగ్ ట్రాక్, చిన్నారుల అటవిడుపు కోసం ఊయలలు, జారుడు బల్లలు ఇలా అన్ని రకాల హంగులూ కల్పించారు. మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న కృష్ణా కెనాల్ వెంబడి సిమెంట్ డివైడర్లను ఏర్పాటు చేసి రంగులతో తీర్చి దిద్దారు. జాతీయ పండుగలు వంటి సమయాల్లో విద్యుత్ లైటింగ్ అమర్చేవారు. వీటితోట నాడు ఏలూరు నగరానికే ఒక విధమైన కళ వచ్చింది. నేడా పార్కుల పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

60 వేల మందికి పైగా చిన్నారులు

ఏలూరు నగర జనాభా దాదాపు 4 లక్షలు. వీరిలో 15 శాతం మంది అంటే సుమారు 60 వేల మంది వరకు 15 సంవత్సరాల్లోపు బాల బాలికలు ఉన్నారు. వీరందరికీ సెలవు రోజుల్లో ఆహ్లాదాన్ని పంచేందుకు సరైన పార్కుల సదుపాయం లేదని చెబుతున్నారు. ప్రధానంగా ఆర్‌ఆర్‌పేట ఎన్‌టీఆర్ పార్కు, పత్తేబాద బృందావనం పార్కు, ఏటిగట్టున ఉన్న జన్మభూమి పార్కులు కొద్దిగా చిన్నారులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఇవి పూర్తి స్థాయిలో చిన్నారులకు సరిపోయే పరిస్థితి ఉంది. మిగతా పార్కులన్నీ శిథిలావస్థకు చేరాయి. అభివృద్ధికి నోచుకోని కొన్ని పార్కులు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. ఇవి కాలేజీకి డుమ్మా కొట్టిన విద్యార్థులు, ప్రేమ జంటలు, పిక్ పాకెటర్స్, మందు బాబులకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయాయి. జన్మభూమి పార్కులో పట్టపగలే కొందరు మద్యం సేవిస్తూ కనిపిస్తున్నారు.



జన్మభూమి పార్కు-2లో ఆక్రమించి హోటల్ నిర్వహిస్తున్న దృశ్యం



టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న పార్కు లోపల నిరుపయోగంగా ఉన్న వాటర్ ఫౌంటెయిన్



జన్మభూమి పార్కు-2లో ఆక్రమంగా నిర్మించిన షెడ్డు



జన్మభూమి పార్కు-2లో నిరుపయోగం ఉన్న ఆట వస్తువులు



టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న పార్కు ముఖ ద్వారం

శిథిలావస్థలో గవర్నర్ ప్రారంభించిన పార్కు

టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న జన్మభూమి పార్కును 2003 సెప్టెంబరు 10న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సూర్జింత్ సింగ్ బర్నాలా ప్రారంభించారు. ఈ పార్కుకు నాటి నాటి ఎంపీ బోళ్ల బుల్లి రామయ్య నిధులు రూ.8 లక్షలు, ప్రభుత్వ సంస్థల నిధులు రూ.8 లక్షలు, మున్సిపల్ నిధులు రూ.3 లక్షలు, జన్మభూమి నిధులు రూ.1.50 లక్షలు, ఏలూరు ట్రేడ్ ఫెయిర్ లాభం రూ.2.50 లక్షలు, దాతలు రూ.2 లక్షలు వెచ్చించారు. ఈ పార్కు పనులను నాటి ఎమ్మెల్యే అంబికా కృష్ణ, ఏలూరు మున్సిపల్ చైర్ పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరీ బలరాంలు స్వయంగా పర్యవేక్షించారు. ఇంతటి చరిత్ర కలిగిన ఈ పార్కు నేడు పూర్తిగా శిథిలమైంది. ముఖ ద్వారా మాత్రమే గత జ్ఞాపకాలకు సాక్షి భూతంగా కన్పిస్తుంది.

ఆక్రమణలు తొలగించాలి

పార్కుల ఆక్రమణలను తొలగించాలి. పార్కులు సరైన నిర్వహణ లేక వెలవెల బోతున్నాయి. ఏలూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఉన్న ఈ పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి. చిన్నారులు, పెద్దలు, వృద్ధులకు ఆటవిడుపుగా ఉండే పార్కుల అభివృద్ధి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదు. కుటుంబం అంతా కలిసి పార్కులో సేదతీరే విధంగా పార్కులను వినియోగంలోకి తెవాలి.

– పి.కిషోర్, ఏఐటీయూసీ నాయకులు, ఏలూరు

అభివృద్ధికి నిధులు కేటాయించాలి

నగరంలోని పార్కుల అభివృద్ధికి నిధుల కేటాయింపులు చేయాలి. వాటి సంరక్షణకు అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేయాలి. ప్రతి ఏటా కొన్ని పార్కులను అభివృద్ధి చేయడం ద్వారా నగరంలోని చిన్నారులకు ఉపయోగపడతాయి. పార్కుల్లో అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకునేందుకు నగరపాలక సంస్థ, పోలీస్ వ్యవస్థ అవసరమైన కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.

– బండి వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఏలూరు

బాబు హయాంలో సంక్షోభం



పోస్టర్ విడుదల చేస్తున్న జేపీ, పార్టీ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : రాష్ట్ర ప్రజలకు సంక్షేమం అంటే ఏమిటో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించగా, కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షోభం అంటే ఏమిటో చూపిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) ఆరోపించారు. బుధవారం స్థానిక 33, 34వ డివిజన్‌లో నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా బాబు ప్రజలను నిలువునా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం బాబు చేసిన మోసాలపై ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుడిదేసి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, నెరుసు చిరంజీవులు, ఘంటా మోహన్‌రావు, జిజ్జువరపు విజయ నిర్మల, ఇనుపనూరి జగదీష్, కొల్లిపాక సురేష్, కార్పొరేటర్ తుమరాడ స్రవంతి, యూత్ నాయకులు ఘంటా సాయి ప్రదీప్, దాలి వెంకటేష్, బండ్లమూడి సునీల్, స్థానిక 34వ డివిజన్ నాయకులు కరణం దుర్గారావు, కరణం జగ్గారావు, గొర్ల దుర్గారావు,బత్తుల నాగేశ్వరరావు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



బస్టాండ్‌లో పైకి లేచిన రాళ్లు



బస్టాండ్‌లో పైకి లేచిన రాళ్లు

ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం.. అధ్వానం



బస్టాండ్ ప్రాంగణంలో దోమల ఆవాస ప్రాంతం

ఏలూరులో ఆర్‌టీసీ బస్టాండ్‌లో అడుగుపెడితే చాలు అడుగడుగునా గోతులు, పెద్దపెద్ద బండరాళ్లు, ప్రాంగణమంతా మురుగునీటితో నిండి అధ్వానంగా మారింది. దోమలు విజృంభిస్తున్నాయి. వర్షం పడితే చెరువును తలపించే విధంగా బస్టాండ్ ప్రాంగణం తయారవుతుంది. జిల్లా యంత్రాంగమంతా ఇక్కడే ఉన్నా ఆర్‌టీసీ బస్టాండ్‌ను పట్టించుకునేవారే లేరు. అధికారులు ఆర్‌టీసీ బస్టాండ్ వైపు ఒకసారి చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు



చెరువును తలపిస్తున్న ఆర్‌టీసీ ప్రాంగణం



బస్టాండ్‌లోకి గోతులతో స్వాగతం

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	48	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	40
వంకాయలు (కాంతులు)	24	బీళ్లచిక్కుడు	140
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	36
బెండకాయలు	38	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	76	కంద	00
కాకర కాయలు	36	బీట్‌రూట్	40
బీరకాయలు	36	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	100
క్యాబేజీ	26	అల్లం	80
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	36	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	25	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	24	పుదీనా	05
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	19
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో 22సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	27
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	25
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	30
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

వైభవంగా జనార్దన స్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని శ్రీ భూ, నీళా సమేత శ్రీ జనార్దన స్వామి దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి జన్మనక్షత్రం పర్వదినం సందర్భంగా ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. స్వామి వారికి పంచామృత అభిషేకం నిర్వహించి విశేష అలంకరణ చేశారు. అనంతరం స్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి విశేష పూజలు చేసి ఊంజల్ సేవ, చుట్టోత్సం నిర్వహించి అనంతరం పవళింపు సేవ నిర్వహించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక మాదేపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో లైన్ల మరమ్మతులు, ఏబీ స్విచ్ నిర్మాణం నిమిత్తం ఆగష్టు 1న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏలూరు డివిజన్ ఈఈ ఆపరేషన్స్ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. చిరంజీవి బస్సు స్టాండ్, అశోక్ చక్రం, లోయ దిబ్బ, పాలతూము సెంటర్, శనగ పప్పు బజార్, దొంగల మండపం రోడ్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు రూరల్ మండలంలో..

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం పైడిచింతపాడు, కొక్కిరాయిలంక గ్రామంలో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాటుండదని అసిస్టెంట్ ఇంజినీర్ నరసయ్య తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వ్యాధులపై అవగాహన అవసరం



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, సిబ్బంది

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల, వర్షాకాలంలో సంభవించే వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఏలూరు కొత్తపేట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శశాంక్ విద్యార్థులకు సూచించారు. జాతీయ డెంగీ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా స్థానిక కొత్తపేట గాంధీ నగర్ మున్సిపల్ హై స్కూల్ విద్యార్థులకు జ్వరాలు, అంటు వ్యాధులపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా నీళ్ల తొట్టెలు, డ్రమ్ములు, మూతల్లేని నూతులు, పూల కుండీలు రుబ్బురోలు, ఫ్లవర్ వాజ్, ఎయిర్ కూలర్స్ ఎప్పటికప్పుడు శుభ్రపరచుకొని మూతలు పట్టుకోవాలని సూచించారు. వేడి వేడి తాజా ఆహార పదార్థాలు భుజించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయురాలు జి.సునీత, ఉపాధ్యాయులు, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం

ఏలూరు (టూటౌన్): ఏలూరు రైల్వే స్టేషన్లో చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ (క్రాఫ్) జిల్లా కోఆర్డినేటర్ ఆర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఆర్పీఎఫ్ ఎస్సై బి.ధనుష్, ఏఎస్సై వీవీ రత్నం, సూరి నాయుడు జీఆర్పీ ఫోర్స్ సీఐవీ దుర్గారావు మాట్లాడుతూ రైల్వేస్టేషన్లో ప్రత్యేక తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. జీఆర్పీ ఫోర్స్ బృందం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు పి.వెంకటేశ్వరరావు, రాజేశ్వరరావు ప్రయాణికులకు అవగాహన కల్పించారు. డిస్టిక్ లీగల్ సర్వీస్ అథారిటీ సభ్యులు పాల్గొన్నారు. చైల్డ్ ట్రాఫికింగ్‌కు సంబంధించి, ఆ చిల్డ్రన్స్‌కు రక్షణ కలిస్తామన్నారు. బాలల రక్షణకు టోల్ ఫ్రీ నంబర్లు 1098, 1800 1027 222లో సంప్రదించాలని కోరారు. ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ కె.సుశీలరావు, క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ ఆర్ వినోద్ కుమార్, జి.రాజలక్ష్మి చంద్రకళ, రేఖ అమరావతి ప్రయాణికులు పాల్గొన్నారు.